




మాట మడతేసి..
ఓట్లెలా అడుగుతారు?

● నేడు పూతలపట్టులో జగన్ సభ సందర్భంగా జనంలో చర్చ

ప్రతిపక్ష నేతగా జిల్లాలో పాదయాత్ర, బస్సుయాత్ర నిర్వహించిన జగన్.. మాటలెన్నో చెప్పారు. ఏ సమస్య ప్రస్తావించినా.. ఏమి కావాలని అడిగినా చేసేస్తామంటూ హామీలిచ్చారు. ముఖ్యమంత్రి అయ్యాక వీటన్నింటినీ పక్కన పెట్టేశారు. ఐదేళ్ల పాటు హామీలను గాలికొదిలేశారు. మళ్లీ ఎన్నికలు రావడంతో.. ప్రచారంలో భాగంగా బుధవారం పూతలపట్టులో బహిరంగ సభ నిర్వహించనున్నారు. గతంలో ఇచ్చిన మాటలను మడతేసి.. ఇప్పుడు మళ్లీ ఓట్లు ఎలా అడుగుతారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా జగన్ గతంలో ఇచ్చిన హామీలు, అమలు తీరు పరిశీలిస్తే..

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

రూ.500 కోట్ల భూమి 'అమూల్' పాలు

అధికారంలోకి రాగానే విజయా డెయిరీని తెరిపిస్తా.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభిస్తారని రైతులు ఎదురు చూస్తే.. చివరకు దీనిని అమూల్‌కు అప్పగించేశారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని విజయా డెయిరీకి చెందిన 27 ఎకరాల భూములు, ఇతర ప్రాంతాల్లోని ఆస్తుల విలువ సుమారు రూ.500 కోట్లు. ఇంత ఆస్తిని ఏడాదికి కేవలం రూ.కోటి చొప్పున ఏకంగా 99 ఏళ్లకు అమూల్‌కి అప్పగించారు. ఇదే అమూల్‌ను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు తిరస్కరించగా.. మన సీఎం జగన్ మాత్రం విజయా డెయిరీని కట్టబెట్టారు. ఇప్పటికీ తమకు జీతాలు రాలేదని విజయా డెయిరీ కార్మికులు 200 రోజులకుపైగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తుంటే పట్టించుకునే వారే లేరు.



విజయా డెయిరీని అమూల్ ప్రతినిధులకు కట్టబెడుతూ..

చక్కెర ఫ్యాక్టరీల హామీ గాలికే..

చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునఃప్రారంభిస్తా.



ఈ ఐదేళ్లలో ఈ దిశగా చర్యలు చేపట్ట లేదు. గతేడాది ఈ రెండు ఫ్యాక్టరీల ఆస్తులు, అప్పులు తేల్చడానికి లిక్విడేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ఫ్యాక్టరీల్లో పని చేసిన ఉద్యోగుల కుటుంబాలకు మాత్రం రూ.21.37 కోట్ల బకాయిలను చెల్లించారు. ఈ రెండు ఫ్యాక్టరీలు ఉన్నప్పుడు జిల్లాలో 54 వేల హెక్టార్లలో రైతులు చెరకు సాగు చేసేవారు. ఇప్పుడు సాగు సగానికి తగ్గింది.



నవ్వులపాలైన 'హంద్రీ నీవా'

హంద్రీ నీవా కాలువను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తా.

మెయిన్ కెనాల్ పనులు పూర్తి చేసేందుకు వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. మెయిన్ కెనాల్ చివరి పాయింట్, కేవీపల్లె మండలంలో అడవిపల్లె రిజర్వాయర్‌కు నీళ్లు వస్తే, అక్కడి నుంచి పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాలకు నీళ్లను తీసుకుని వచ్చుండొచ్చు. కానీ, ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు నియోజకవర్గానికి నీళ్లిచ్చామని చెప్పుకోనేందుకు హంద్రీనీవా కుప్పం బ్రాంచి కాలువ పనులు హడావిడిగా చేశారు. సీఎం జగన్ వచ్చి నీళ్లను విడుదల చేసిన మరుసటి రోజుకే కాలువలో నీటి ప్రవాహం తగ్గింది. రోజుల వ్యవధిలోనే కాలువ ఎండిపోయింది. ఈ చర్యలతో ప్రభుత్వం నవ్వులపాలైంది.

గాలేరు-నగరి మాటే లేదు

గాలేరు- నగరి సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు, రైతులకు తాగు, సాగునీరు అందిస్తా.

టీడీపీ ప్రభుత్వం ఉన్నంతవరకు జరిగిన 80శాతం పనులే తప్ప.. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక శాతం పనులు కూడా జరగలేదు. ఇది పూర్తయితే నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు నీటిఎద్దడి లేకుండా పోతుంది. గాలేరు నగరి సాధన కోసం టీడీపీ హయాంలో పాదయాత్ర చేసిన ఆర్కే రోజా.. ఇప్పుడు మంత్రి అయినా నోరు మెదపడం లేదు.



మరోసారి 'పాలారు' హామీ

పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి మా నాన్న శంకుస్థాపన చేశారు. కోర్టు వివాదాలను పరిష్కరించి ప్రాజెక్టు నిర్మాణం చేపడతా.

ప్రతిపక్ష నేతగా కుప్పంలో బస్సు యాత్ర చేసినప్పుడు ఈ హామీ ఇవ్వగా.. ఐదేళ్లలో ఒక్క కోర్టు వివాదం కూడా పరిష్కారం కాలేదు. ప్రాజెక్టు నిర్మాణానికి ఒకడుగు కూడా ముందుకు పడలేదు. ఎన్నికల ముందు.. ఇటీవల కుప్పం పర్యటనలో.. పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశానని సీఎం జగన్ చెప్పారు. ఇన్నాళ్లు కోర్టు వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఎన్నికల ముందు మరోసారి పాలారు ప్రస్తావన తేవడంపై స్థానికంగా విమర్శలు వచ్చాయి.



ఉదయం జూనియర్, మధ్యాహ్నం డిగ్రీ కాలేజీ



జీడీనెల్లూరు నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తా.

నాలుగేళ్ల కిందట వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికం పేరుతో డిగ్రీ తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం జూనియర్.. మధ్యాహ్నం డిగ్రీ కళాశాలలు నిర్వహిస్తున్నారు. ఒంటి పూట నిర్వహణతో ఇక్కడ జూనియర్ కాలేజీ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ఇలా జూనియర్ కాలేజీని బలహీనపరిచారే కానీ.. కొమ్మరగుంట రెవెన్యూ పరిధిలో శిలాఫలకం వేసిన స్థలంలో భవనాల నిర్మాణం చేపట్టలేదు. నిధుల మంజూరు అంటూ ఉత్తర్వులు జారీ అయినా.. పునాది రాయి పడలేదు.

అగ్నిమాపక కేంద్రం భూమి పూజతో సరి



జీడీ నెల్లూరు నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తా.

వెదురుకుప్పం సమీపంలో అగ్నిమాపక కేంద్రానికి స్థలాన్ని కేటాయించారు. కేంద్రం మంజూరుతో పాటు ఉద్యోగుల్నీ కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రాంతంలో భూమి పూజ కూడా చేశారు. రెండేళ్లు పూర్తయినా అగ్నిమాపక కేంద్రానికి పునాది రాయి పడలేదు.

ప్రాజెక్టుల ఊసే లేదు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో మూడు ప్రాజెక్టులను నిర్మించడంతో పాటు ఎన్టీఆర్ జలాశయాన్ని అన్ని చెరువులకు అనుసంధానం చేస్తా.

వెదురుకుప్పం మండలం బొప్పలమడుగు, కార్వేటినగరం మండలం కృష్ణాపురం సమీపంలోని ఓ ప్రాంతంలో, పాలసనముద్రంలో.. ఇలా మూడు ప్రాజెక్టుల నిర్మాణానికి ఇచ్చిన హామీల్లో దేన్నీ పట్టించుకోలేదు. చెరువుల అనుసంధానం మాటే లేదు.

ఎస్పీ జాషువాపై ఈసీ బదిలీ వేటు

● వైసీపీకి అనుకూలంగా ఉన్నారంటూ ఆధారాలతో టీడీపీ ఫిర్యాదు

చిత్తూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎస్పీ జాషువాపై మంగళవారం ఈసీ బదిలీ వేటు వేసింది. విధుల్లో చేరిన రెండు నెలలకే అవమానకరమైన రీతిలో బదిలీకి గురి కావడంతో పాటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించడం గమనార్హం. 'మనం ఎన్నికల సంఘం పరిధిలో పనిచేస్తున్నాం. ఏ పార్టీకీ అనుకూలంగా ఉండొద్దు. నిక్కచ్చిగా వ్యవహరించండి' అంటూ నిత్యం పోలీసు అధికారుల సమావేశాల్లో, టెలీకాన్ఫరెన్సుల్లో చెప్పే ఎస్పీ జాషువా.. లోపల మాత్రం వైసీపీకి అనుకూలంగా చేయాల్సిందంతా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తారనే ఆయన్ను బదిలీపై జిల్లాకు పంపినట్లు తెలుస్తోంది. గతంలో విజయవాడ శాంతిభద్రతల డీసీపీ, కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేసినప్పుడు కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. వైసీపీకి విధేయుడనే ముద్ర వేసుకోవడం తోనే జిల్లాకు వచ్చారనే ప్రచారం జరిగింది. దీనికి బలం చేకూరేలా ఆయన జిల్లాకు వచ్చిన వెంటనే తన టీమ్‌ను సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొన్ని రోజుల ముందే జిల్లాలో అటాచ్‌మెంట్‌లో ఉన్న సుమారు 200 మంది సిబ్బందిని పూర్వ స్థానాలకు బదిలీ చేశారు. దీంతో పాటు కీలకమైన స్పెషల్ బ్రాంచి విభాగంలోనూ 14 మందితో టీమ్‌ను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఇలా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించే ఎస్‌ఐ, సీఐలను క్షేత్రస్థాయిలో సిద్ధం చేసినట్లు ప్రచారంలో ఉంది. ఆయన వచ్చాక 400 మందికిపైగా టీడీపీ శ్రేణుల్ని బైండోవర్ చేసినట్లు సమాచారం.ఇలా జిల్లాలో వైసీపీ విజయానికి అవసరమైన ప్లాన్ అమలులో భాగస్వామ్యం అయ్యారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు కలెక్టర్లు, ఎస్పీలపై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. అందులో ఎస్పీ జాషువా కూడా ఉన్నారు. దీనిపై విచారించి తగిన ఆధారాలను సేకరించిన కేంద్ర ఎన్నికల సంఘం.. రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు చిత్తూరు ఎస్పీని కూడా బదిలీ చేసి, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. ఫిబ్రవరి 4న బాధ్యతలు స్వీకరించిన జాషువా.. ఏప్రిల్ 2న బదిలీ వేటుకు గురయ్యారు. అడ్మిన్ ఏఎస్పీ అరీపుల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా వ్యవహరించనున్నారు. నేడో రేపో కొత్త ఎస్పీని నియమించే అవకాశముంది.



కాంగ్రెస్ అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల ప్రకటన

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2: రాష్ట్రానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో తొలి జాబితా మంగళవారం విడుదల చేసింది. చిత్తూరు ఎంపీ స్థానానికి చిట్టిబాబు పేరు ఖరారు చేసింది. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి.. పుంగనూరుకు డాక్టర్ మురళీ మోహన్ యాదవ్, నగరికి పి.రాకేష్‌రెడ్డి, చిత్తూరుకు టికారాం, పలమనేరుకు శివశంకర్, కుప్పానికి ఆవుల గోవిందరాజు పేర్లను ప్రకటించారు.

అమ్మో.. జగన్ వస్తున్నారు!





చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు - బంగారుపాళ్యంలో బస్సు ఎక్కడానికి అవస్థలు పడుతున్న విద్యార్థులు

● సగానికిపైగా ఆర్టీసీ బస్సులు ఆయన సభకే ● మొదలైన ప్రయాణికుల కష్టాలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2: సీఎం జగన్ వస్తున్నారంటే ప్రయాణికులకు కష్టాలు మొదలైనట్లే. బుధవారం పూతలపట్టులో ఎన్నికల సభ ఉండటంతో మంగళవారం నుంచే ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. జగన్ సభకు చిత్తూరు ఉమ్మడి జిల్లా, కడప జిల్లా నుంచి 1020 బస్సులు కేటాయించారు. వీటిలో చిత్తూరు జిల్లా నుంచే 210 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. జిల్లాలో మొత్తం ఆర్టీసీ బస్సులు 390 ఉంటే.. అందులో 55 శాతం జగన్ సభకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిత్తూరు బస్టాండులో రాత్రి 10 గంటలైనా బస్సులు లేక ప్రయాణికులు వేచి ఉన్నారు. తిరుపతి, తిరుమలకు వెళ్లే బస్సులు లేక భక్తులు కూడా అవస్థ పడ్డారు. కర్ణాటక, తమిళనాడు బస్సులు కిక్కిరిశాయి.

ఇళ్లకు తిరిగి వెళ్లిన విద్యార్థులు

బంగారుపాళ్యం: పుంగనూరు నియోజకవర్గంలో మంగళవారం సీఎం జగన్ బస్సుయాత్రకు జనాన్ని తరలించడానికి పలమనేరు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. చౌడేపల్లెకు బస్సులను పంపడంతో బంగారుపాళ్యం విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. ఆర్డినరీ బస్సుల్లేక, సమయానికి కళాశాలలు, పాఠశాలలకు వెళ్లలేక చాలా మంది ఇళ్లకు వెనుదిరిగారు. బంగారుపాళ్యం నుంచి చిత్తూరుకు సుమారు 500 మంది పాసులపై వెళుతుంటారు. చిత్తూరుకు వెళ్లేందుకు ఉదయం 7 గంటల వరకు వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో వెనుతిరిగారు.



సుగుటూరు గంగజాతర ప్రారంభం



సుగుటూరు గంగమ్మకు తొలిపూజ చేస్తున్న జమీందారీ వంశస్తులు

పుంగనూరు, ఏప్రిల్ 2: పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక నగరిలోని జమిందారీ ప్యాలెస్ దర్బారు కొలువలోట గంగమ్మను ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ ఏడాది అందరికీ ఉచిత దర్శనం కల్పించడంతో అధిక సంఖ్యలో భక్తులు రావడం, పోలీసులు లేకపోవడంతో తోపులాట జరిగింది. ఎండకు మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులు తిరిగి వెళ్లే మార్గంలోనే అధికారపార్టీ శ్రేణులు పలుమార్లు ఎదురుగా రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంటి ఇలవేల్పు సుగుటూరు గంగమ్మకు మంగళవారం రాత్రి ప్యాలెస్‌లో జమిందారీ కుటుంబీకులు ఆనవాయితీ ప్రకారం తొలిపూజ చేశారు. సోమశేఖర చిక్కరాయులు, మల్లిఖార్జునరాయులు, వారి కుటుంబీకులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలత, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ తదితరులు పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పుష్పపల్లకిలో అమ్మవారిని కొలువుతీర్చి తేరువీధి, సెంటర్‌లాడ్జి, సుబేదారు వీధి, బెస్తవీధి, తూర్పుమొగసాల, కుమ్మరవీధి, కట్టకిందపాళ్యం ప్రాంతాల్లో ఊరేగించారు. ఊరేగింపులో జంతుబలులు ఇచ్చారు. పట్టణంలోని అమ్మవారి ఆలయాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు.

నేడు ఆలయంలో భక్తుల సందర్శన

పుంగనూరు ప్యాలెస్ ఆవరణలోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో అమ్మవారిని బుధవారం వేకువజామునుంచి భక్తుల సందర్శనార్థం అనుమతిస్తారు. జాతరలో అమ్మవారికి గెరిగెలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాట్లు చేశారు.

మాటా పలుకు లేకుండా..!

- అభివాదాలతో సాగిన సీఎం బస్సుయాత్ర -



చౌడేపల్లెలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

పుంగనూరు/చౌడేపల్లె/సోమల/సదుం, ఏప్రిల్ 2: ఒక్క మాటా మాట్లాడలేదు. ఎక్కడైనా జనముంటే బస్సుపైకి ఎక్కి అభివాదం చేయడం.. లేదంటే బస్సులోనుంచే చేతులూపుతూ ముందుకు సాగడం.. కొన్ని చోట్ల కరచాలనాలు ఇవ్వడం.. ఇలా జిల్లాలో మంగళవారం రాత్రి సీఎం జగన్ బస్సు యాత్ర సాగింది. మదనపల్లె నుంచి సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి బస్సు యాత్రలో భాగంగా సాయంత్రం ఏడు గంటలకు పుంగనూరు నియోజకవర్గంలోకి ప్రవేశించారు. పుంగనూరు మండలం కృష్ణాపురం, చౌడేపల్లె మండలం భవానీనగర్, బోయకొండ, పెద్దూరు, చౌడేపల్లె, ఆమనిగుంట, సింగిరిగుంట, సోమల మండలం ఇరికిపెంట, సోమల, సూరయ్యగారిపల్లె, సదుం మండలం గొంగివారిపల్లె, అమ్మగారిపల్లెకు 10.45 గంటలకు బస్సుయాత్ర చేరింది. ఎక్కడా ఒక్క మాటా మాట్లాడకపోవడంతో వైసీపీ శ్రేణులు నిరుత్సాహపడ్డారు. బస్సుయాత్ర సందర్భంగా పలుచోట్ల రోడ్డుపై ఉన్న చెట్లు, కొమ్మలు కొట్టేశారు.

నేటి పర్యటన ఇలా..

చిత్తూరు: బుధవారం ఉదయం సదుం సర్కిల్, కల్లూరు సర్కిల్, పాటూరు మీదుగా జగన్ పూతలపట్టుకు జగన్ బస్సు యాత్ర చేరుకుంటుంది. సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం తిరుపతి జిల్లాకు బయలుదేరుతారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : సా. 6.30
సహరి (గురువారం) : ఉ. 4.47

జిల్లా కలెక్టర్ లక్ష్మీశపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. విధుల్లో చేరిన రెండు నెలలకే అవమానకరమైన రీతిలో బదిలీకి గురి కావడంతో పాటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించడం గమనార్హం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతి కలెక్టర్ లక్ష్మీశపై

ఈసీ బదిలీ వేటు

జిల్లాలో మరికొందరిపైనా చర్యలు?

ప్రస్తుతానికి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో వున్న కలెక్టర్ లక్ష్మీశ బదిలీ వేటుకు గురి కాగా తదుపరి జిల్లాలో మరికొందరు అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశముందని సమాచారం. ముఖ్యంగా చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు చెందిన కీలక అధికారుల తీరు పట్ల ప్రతిపక్ష పార్టీల నాయకులు అపనమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. వారి తీరుపై ఆధారాలతో ఇప్పటికే ఈసీకి ఫిర్యాదు చేశారు. అలాగే మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో పలువురు అధికారులు, ఉద్యోగులు అధికార పార్టీకి అనుకూలంగా ఏకపక్షంగా పనిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చాలావరకూ ఆధారాలు జతచేసి మరీ టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేస్తున్నారు. ఆ క్రమంలో రానున్న కొద్ది రోజుల్లో మరికొందరిని కూడా ఎన్నికల విధుల నుంచీ తప్పించే అవకాశముంది.

ఎమ్మెల్యేని ఇంటికెళ్ళి కలిసి....

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత జనవరి ఆఖర్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తుండిన లక్ష్మీశ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో వచ్చినందున జిల్లా ఎన్నికల అధికారిగా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని ప్రజలకు, రాజకీయ పార్టీల నేతలకు నమ్మకం కలిగించే విధంగా ఆయన నడుచుకోవాల్సి వుండింది. కానీ గత జనవరి 31వ తేదీన బాధ్యతలు చేపట్టగా అదే రోజు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికి వెళ్ళి కలిశారు. ఆ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అది తిరుపతిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. టీడీపీతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులంతా మీడియా సమావేశాలు పెట్టి మరీ ఆయన తీరుపై విమర్శలు, ఆరోపణలు చేశారు. జిల్లాలో నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహిస్తారని కలెక్టర్‌పై తమకు నమ్మకం లేదంటూ ప్రకటించారు.ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయన జిల్లాలో తొలి అడుగే వివాదాస్పదమైంది.

చంద్రగిరి టీడీపీ నేతల ఫిర్యాదులపై ఈసీని తప్పుదోవ పట్టించే ప్రయత్నం

చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అనేక అంశాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.ఈ ఆర్వో కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది అధికార పార్టీ ఎమ్మెల్యేకి అనుకూలంగా పనిచేస్తున్నారనే అంశంపై ప్రధానంగా ఫిర్యాదులు చేశారు. వీటిపై కలెక్టర్‌ను ఈసీ వివరణ కోరగా ఫిర్యాదుల్లో స్పష్టత లేదని ఆయన ఈసీకి సమాధానం ఇచ్చినట్టు సమాచారం.అయితే తాము చేసిన ఫిర్యాదులకు సంబంధించి టీడీపీ నేతలు ఆధారాలను కూడా ఈసీకి సమర్పించి వుండడంతో కలెక్టర్ పనితీరుపై ఈసీ అసంతృప్తికి లోనైనట్టు తెలిసింది.

వైసీపీ ప్రచార సామగ్రి ఉదంతంలో నిర్లక్ష్యం

రేణిగుంట శివార్లలో గత నెల 26వ తేదీన నాలుగు గోదాముల్లో రూ. కోట్ల విలువైన వైసీపీ ప్రచార సామగ్రి పట్టుబడిన సంగతి తెలిసిందే. దీనిపై తొలుత రేణిగుంట టీడీపీ నేతలు గోదాముల వద్ద ఆందోళనకు దిగారు. తర్వాత చంద్రగిరి టీడీపీ నేతలు గోదాముల వద్దే రాత్రంతా కాపలా కాశారు. ఆపై శ్రీకాళహస్తి టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. వారూ గోదాముల వద్ద ఆందోళన చేపట్టారు. తిరుపతి టీడీపీ నేతలు కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేశారు. గోదాముల్లో నేరుగా పార్టీకి సంబంధించిన ప్రచార సామగ్రిపై ఎవరికీ పెద్దగా అభ్యంతరాల్లేవు. కానీ కొన్ని గోదాముల్లో ఒకరిద్దరు వైసీపీ నాయకుల వ్యక్తిగత ప్రచారానికి సంబంధించిన సామగ్రి, అలాగే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రి పట్టుబడ్డాయి. వాటిపై పేర్లు, ఫొటోలు కూడా స్పష్టంగా కన్పిస్తున్నా అధికారులు అత్యంత ఉదాసీనంగా వ్యవహరించారు. రేణిగుంట మండల అధికారుల నుంచీ శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి దాకా, అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీలు కూడా బాధ్యతగా స్పందించలేదు. నాలుగు రోజుల పాటు వివాదం కొనసాగినా కలెక్టర్ గానీ, ఎస్పీ గానీ గోదాములను పరిశీలించకపోవడం విమర్శలకు దారి తీసింది. ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి దొరికినపుడు లోతుగా విచారణ జరపడం అటుంచి ఆధారాలు దొరికిన మేరకైనా బాధ్యులకు నోటీసులు జారీ చేయడం, వారిపై చర్యలకు ఉపక్రమించకపోవడం అందరిలో అనుమానాలు రేకెత్తించింది. చివరికి మీడియా ద్వారా కూడా జిల్లా అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాచారం, సమాధానం ఇవ్వలేదు. ఇతర జిల్లాల్లో ఇలాంటి వస్తువులు పట్టుబడినప్పుడు వాటిని కోర్టులకు స్వాధీన పరిచి, కోర్టుల అనుమతితో వాటిని రిలీజ్ చేయడం జరుగుతోంది. అయితే రేణిగుంట ఉదంతంలో జిల్లా అధికారులు ఆ పద్ధతి పాటించకుండా బిల్లులు చూపించారని చెప్పి నేరుగా సామగ్రిని విడుదల చేయడం విమర్శలకు దారి తీసింది. ఈ వ్యవహారంపై స్థానిక టీడీపీ నేతలతో పాటు విజయవాడలో వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలసి ఫిర్యాదు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ కలెక్టర్ లక్ష్మీశ తీరు సక్రమంగా, పారదర్శకంగా లేదని భావించి బదిలీ వేటు వేసింది.

జిల్లా పరువు తీస్తున్న అధికారులు

నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిజాయితీగా పనిచేయాల్సిన అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారులు తాము తప్పటడుగులు వేయడంతో పాటు ఏకంగా జిల్లా పరువు కూడా తీస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా 2020-21లో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా అరాచక పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అధికార పార్టీ నేతలు, శ్రేణులు పలుచోట్ల రెచ్చిపోయి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్, తిరుపతి అర్బన్ ఎస్పీ, పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, శ్రీకాళహస్తి సీఐలు తమ పరిధిలో జరిగిన ఈ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమయ్యారు. దీంతో 2021 జనవరి 27న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అప్పటి కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డిలతో పాటు పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, శ్రీకాళహస్తి సీఐలపై బదిలీ వేటు వేశారు. ఈ పరిణామంతో జిల్లా ప్రతిష్ట దెబ్బ తింది. అదే ఏడాది జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో నకిలీ ఓటరు కార్డులతో దేశవ్యాప్తంగా జిల్లా పరువు పోయిన సంగతీ తెలియంది కాదు. ఆ ఎన్నికల్లో దారుణమైన తప్పిదాలకు బాధ్యులుగా మారడంతో అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి తదుపరి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా వుండిన గిరీశపై ఈ ఏడాది జనవరి 19న ఈసీ సస్పెన్షన్ వేటు వేసింది. ఆ క్రమంలో తిరుపతి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి సహా ఇద్దరు సీఐలు, కిందిస్థాయి సిబ్బంది కూడా సస్పెండయ్యారు. ఈ రెండు ఘటనలతో జిల్లా ప్రతిష్ట దెబ్బతిందని ప్రజానీకం బాధపడుతున్న తరుణంలో తాజాగా కలెక్టర్ లక్ష్మీశ సస్పెన్షన్ జిల్లా పరువు మరోసారి గంగలో కలిసినట్టయింది. ఐఏఎస్ కెరీర్‌లో తొలిసారి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన లక్ష్మీశ 60 రోజుల స్వల్ప వ్యవధిలోనే ఈసీ కన్నెర్రకు గురై బదిలీ కావడం, ఎన్నికల ప్రక్రియ ముగిసే దాకా ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించే పరిస్థితి రావడం జిల్లా అధికార, ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మూడేళ్ళ వ్యవధిలో మూడు పర్యాయాలు జిల్లా వేదికగా జరిగిన ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి కీలక అధికారులు ఎన్నికల కమిషన్ చర్యలకు గురి కావడం మాత్రం నిస్సందేహంగా జిల్లా ప్రతిష్టను మసకబారేలా చేసింది. కాగా ఆయన స్థానంలో ఇంఛార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర బాధ్యతలు చేపట్టారు.

బాబోయ్!

చిత్తూరులో 42.9 డిగ్రీలు



గంగాధరనెల్లూరు మండలం 100గొల్లపల్లె జైన్‌ఫ్యాక్టరీ వద్ద నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి



ఎండకు ఉపశమనంగా..

చిత్తూరు కలెక్టరేట్/గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 2: ఎండలు మండుతున్నాయి. రోజు రోజుకూ ఉష్ణోగ్రత పెరుగుతుండటంతో పలు మండలాల్లో 40 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. మంగళవారం ఎండ తీవ్రతకు భయపడి ప్రజలు రోడ్డుమీదకు రాలేకపోయారు. అత్యధికంగా చిత్తూరులో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల వారీగా. గుడుపల్లె, విజయపురం, నగరిలో 42.4 డిగ్రీల చొప్పున, ఎస్‌ఆర్‌పురంలో 42.3, తవణంపల్లెలో 42.2, నింద్రలో 41.7, గుడిపాల, పుంగనూరులో 41.1 చొప్పున, పాలసముద్రంలో 40.5, చౌడేపల్లె, యాదమరి, రొంపిచెర్లలో 39.9 వంతున, బంగారుపాళ్యం, శాంతిపురంలో 39.8, వెదురుకుప్పంలో 39.6, కుప్పం, గంగవరం, సోమల, సదుం, వి.కోటలో 39.4 చొప్పున, పెద్ద పంజాణిలో 39.3, కార్వేటినగరంలో 39.2, జీడీ నెల్లూరులో 39, బైరెడ్డిపల్లెలో 38.5, పెనుమూరులో 38.4, పలమనేరులో 37.8, రామకుప్పం, పూతలపట్టులో 37.7, పులిచెర్లలో 37.6, ఐరాలలో 37.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఎండల తీవ్రతతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 11 గంటలు దాటాక కొందరు డ్రైవర్లు వాహనాలను రోడ్డుపక్కన పెట్టేసి చెట్లకింద సేదతీరుతున్నారు.

స్నానం కోసం వెళ్లి..

- చెరువులో పడి ఇద్దరు విద్యార్థుల మృతి



ఆకాష్, సంతోష్ మృతదేహాలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2: చెరువులో స్నానం కోసం వెళ్లిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడిన సంఘటన చిత్తూరు రూరల్ మండలం పచ్చనపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పచ్చనపల్లి హరిజనవాడకు చెందిన కుప్పయ్య కుమారుడు ఆకాష్ 10వ తరగతి, త్యాగరాజులు కొడుకు సంతోష్ 9వ తరగతి, మరో పిల్లవాడితో కలిసి ఆవులు మేపేందుకు వెళ్లారు. ఎండకు తట్టుకోలేక స్నానం చేద్దామని ఆకాష్, సంతోష్ చెరువులో దిగి ఆడుకుంటుండగా, వారితో వచ్చిన పిల్లవాడు టాయిలెట్‌కు అని వెళ్లాడు. అతడు తిరిగి వచ్చే సరికి ఆ ఇద్దరు విద్యార్థులు కనపడలేదు. రాళ్ల వేసినా బయటకు రాలేదని ఆ చెరువులోనే చేపలు పట్టేందుకు వచ్చిన వ్యక్తికి ఆ పిల్లవాడు చెప్పాడు. దీంతో అతడు చెరువులోకి దూకి వెతుకుతుండగా సంతోష్ ప్రాణాలతో దొరికాడు. అతడికి ఫస్ట్ ఎయిడ్ చేసి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్ మృతి చెందాడు. ఎంత వెతికినా ఆకాష్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చి చెరువులో వెతికించగా, చెరువు లోపల బురదలో ఇరుక్కుపోయి కనపడ్డాడని గ్రామస్తులు తెలిపారు. అప్పటికే ఆకాష్ మృతి చెంది ఉన్నాడని తెలిపారు. ఇద్దరు విద్యార్థుల మృతితో పచ్చపనల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

జడ్పీ మాజీ సీఈవోపై విచారణాధికారిగా జేసీ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణ అధికారిగా పంచాయతీరాజ్ రాష్ట్ర స్థాయి అధికారిని నియమిస్తారని అనుకున్నారు. అయితే కలెక్టర్ షన్మోహన్ విచారణ అధికారిగా చిత్తూరు జేసీ శ్రీనివాసులు పేరును ప్రతిపాదించినట్లు తెలిసింది. నేడో, రేపో ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో కూడా ఇతడిపై లోకాయుక్తలో వచ్చిన ఫిర్యాదులు, విచారణపై నివేదికలను కూడా జేసీ శ్రీనివాసులు పంపించారు. ఇదిలా ఉండగా జిల్లాలో, జడ్పీ పరిధిలో సుదీర్ఘకాలం పనిచేయడం, అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల్లో ప్రభావితం చేసే అవకాశం ఉందని శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఇతర టీడీపీ నాయకులు కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎట్టకేలకు మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

251 మందికి స్పాట్ మినహాయింపు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 2: అనారోగ్య సమస్యలతో స్పాట్‌కు వచ్చిన 251 మంది టీచర్లకు మినహాయింపు ఇచ్చినట్లు డీఈవో దేవరాజు ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. స్పాట్‌కు వచ్చిన టీచర్లు కేవలం ఫేషియల్ అటెండెన్స్ కోసం సెల్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారని, ఆ తర్వాత సాయంత్రం 5 గంటల వరకు వినియోగించలేదని వివరణ ఇచ్చారు.

త్వరలో ముగ్గురు ఎన్నికల పరిశీలకుల రాక

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో ముగ్గురు పరిశీలకులు రానున్నారని ఆర్వో, జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికల ప్రచార, ఇతరత్రా వ్యవహారాల పరిశీలనకు వారు ఎప్పుడైనా, ఎక్కడైనా పర్యటించే అవకాశం ఉందన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం చిత్తూరు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ సమావేశమయ్యారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ప్రచార ఖర్చులను అభ్యర్థుల ఖర్చుగా నమోదు చేస్తామన్నారు. అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు అనుమతులు ఉన్నాయన్నారు. ప్రచారాలకు అనుమతి తప్పనిసరన్నారు. సింగిల్‌విండో విధానం ద్వారా ప్రాధాన్యం మేరకు అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించి సందేహాలుంటే ఆర్వోతో పాటు నలుగురు ఏఆర్వోల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నుంచి అభ్యర్థి గురజాల జగన్మోహన్, రాజసింహులు, సురేంద్రకుమార్, వైసీపీ నుంచి అభ్యర్థి విజయానందరెడ్డి, ప్రతాప్, ఉదయ్ కుమార్, కాంగ్రెస్ తరఫున లోకేష్, బీఎస్పీ నుంచి భాస్కర్, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలను పరిశీలించండి

వివిధ టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యే రాజకీయ పార్టీల ప్రకటనలు, సమావేశాలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అనుమతి పొందారో లేదో నిశితంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. టీవీ ఛానల్స్‌లో ప్రసారం చేసే ప్రకటనల కోసం అభ్యర్థులు లేదా వారి పార్టీ అధిష్ఠానం జిల్లా ఎంసీఎంసీ కమిటీ ఆమోదం పొందాలన్నారు. కమిటీ నోడల్ అధికారి నాగేశ్వరరావు, అసిస్టెంట్ అధికారి మోహన్‌బాబు, డీడీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాహనం దగ్ధం



పుంగనూరు, ఏప్రిల్2: గడ్డితో సహా వాహనం దగ్ధమైంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేర కు.. మంగళవారం పలమనేరు నుంచి ఓ వాహనంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని పురాండ్లపల్లెకు గడ్డి తరలిస్తున్నారు. పురాండ్లపల్లె సమీపంలో విద్యుత్ లైన్లకు గడ్డి తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు ఎగసి గడ్డిపై పడ్డాయి. దీంతో గడ్డికి మంటలు అంటుకుని కాలిపోయింది. రైతులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేసేలోగా గడ్డి, అశోక్‌లేల్యాండ్ వాహనం కాలిపోయాయి. రూ.3లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉంటుంది.

బాలికపై అత్యాచారయత్నం

- ఇద్దరు యువకులపై ఫోక్సో కేసులు
- నిందితుల్లో ఒకరు ఆత్మహత్యాయత్నం

రామకుప్పం, ఏప్రిల్ 2: రామకుప్పం మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఇద్దరు యువకులపై ఫోక్సో కేసు నమోదైంది. నిందితుల్లో ఒకడు ఆత్మహత్యకు యత్నించగా, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. తమిళనాడుకు చెందిన ఓ బాలిక మండలంలోని తన పిన్ని వద్ద ఉంటూ చదువుకుంటోంది. సోమవారం సాయంత్రం పొరుగు గ్రామంలోని దుకాణంలో తన తమ్ముడికి బిస్కెట్లు తీసుకురావడానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా శేఖర్(20), ధనశేఖర్(20) అనే యువకులు గ్రామ పొలిమేర్లలో ఆమెపై అత్యాచారానికి యత్నించారు. ఆమె కేకలు వేయడంతో వారు పారిపోయారు. ఈ విషయాన్ని బాలిక కుటుంబసభ్యులకు తెలిపింది. ఈ విషయం కాస్త చుట్టుపక్కల గ్రామాలకు చేరడంతో అవమానంతోనో లేదా భయంతోనో ధనశేఖర్ సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు స్థానికులు తెలిపారు. బాలిక పిన్నమ్మ ఫిర్యాదు మేరకు శేఖర్, ధనశేఖర్‌పై పోలీసులు ఫోక్సో కేసులు నమోదు చేశారు. ధనశేఖర్ ఆత్మహత్యకు యత్నించడంపై తమకు ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

సారా విక్రేతకు 20 నెలల జైలుశిక్ష

- రూ.2 లక్షల జరిమానా

నగరి ఏప్రిల్ 2: నగరి పట్టణ పరిధిలోని సత్రవాడ దళితవాడకు చెందిన చిన్నతంబికి సారా విక్రయం కేసులో 20 నెలల జైలుశిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ మంగళవారం మేజిస్ట్రేట్ విష్ణువర్మ తీర్పు చెప్పినట్లు ఎస్‌ఈబీ సీఐ మాధవి తెలిపారు. 2020లో 20 లీటర్ల సారాతో పట్టుబడిన కేసులో ఈ శిక్ష పడిందన్నారు.

కాంట్రాక్టర్లకు రూ.13వేల కోట్లు పంచారు

పింఛన్లకు డబ్బులు లేవా జగనా? ● టీడీపీ నేతల ప్రశ్న

- ఇళ్ల వద్దకు పెన్షన్ పంపిణీ చేయకపోతే నిరసనలు చేస్తాం



జేసీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2: సొంత పార్టీ కాంట్రాకర్లకు దొడ్డిదారిన రూ.13వేల కోట్లు చెల్లించిన జగన్‌రెడ్డి ప్రభుత్వం వద్ద పెన్షన్ల పంపిణీకి నిజంగా డబ్బులు లేవా? అంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఎండల్లో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను సచివాలయాలకు వెళ్లి పెన్షన్ తీసుకోవాని ప్రభుత్వం ఆదేశించడం దుర్మార్గమన్నారు. వలంటీర్ల స్థానంలో ప్రభుత్వ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నేరుగా పెన్షన్లు అందించే చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే కలెక్టరేట్, మున్సిపాలిటీ, తహసీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈమేరకు వీరు మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శ్రీనివాసులును కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ల నుంచి ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోందని, త్వరలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోనుందని జేసీ వెల్లడించారు. అనంతరం కలెక్టరేట్ వెలుపల వీరు మీడియాతో మాట్లాడారు. జేసీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, సురేంద్రకుమార్, రాజశేఖర్ ఉన్నారు.

జాతరలో గొర్రె పొట్టేళ్ల సంత



పుంగనూరులో జరిగిన గొర్రెపొట్టేళ్ల సంత

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2: సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం పుంగనూరు ఆర్టీసీ డిపో సమీపంలోని తోపుమఠం వద్ద గొర్రెపొట్టేళ్ల సంత నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి గొర్రెపొట్టేళ్లతో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు భారీగా తరలి వచ్చి కొనుగోళ్లు చేశారు. సంతలో రూ.10వేలు నుంచి రూ.55వేలు విలువ చేసే పొట్టేళ్ల వ్యాపారం సాగింది. జాతరలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు జంతుబలుల కోసం పుంగనూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారు భారీసంఖ్యలో గొర్రెపొట్టేళ్లు, కోళ్లు కొనుగోలు చేశారు.

ఎటు చూసినా జనమే

జాతర సందర్భంగా పుంగనూరులో ఎటు చూసినా జన సందడి కనిపించింది. బజారువీధిలో చలువపందిళ్లు వేయగా, పలుచోట్ల వ్యాపారులు, దాతలు అన్నదానాలు, అంబలి, మజ్జిగ, తాగునీరు, పానకాలు భక్తులకు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి పారిశుధ్య పనులు, తాగునీటి ఏర్పాట్లు చేయగా వైద్యసిబ్బంది హెల్త్‌క్యాంపులు నిర్వహించారు. బుధవారం గంగమ్మకు గెరిగెలతో మొక్కులు తీర్చుకోవడానికి పోలీస్‌స్టేషన్, పాతబస్టాండ్, ఇందిరాసర్కిల్ వద్ద కుండలు, వేప, మామిడి ఆకులు, దవణం, పూలు తదితర వస్తువులు అమ్మకాలకు సిద్ధం గా పెట్టుకున్నారు.



అమ్మవారి ఊరేగింపు కోసం ప్యాలెస్ వద్ద ఎదురుచూస్తున్న భక్తులు

గెరిగెలతో మారెమ్మకు మొక్కులు



సుగుటూరు గంగమ్మ సోదరీమణి, పుంగనూరులోని ప్రైవేటు బస్టాండ్ వద్దనున్న విరూపాక్షిమారెమ్మకు మంగళవారం గెరిగెలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పానకం, మజ్జిగ కుండలకు పూలు, వేపాకుతో గెరిగెలు అలంకరణలతో ఇళ్ల నుంచి మారెమ్మ ఆలయం వరకు తలపై పెట్టుకుని వచ్చి మొక్కులు చెల్లించి జంతుబలులు ఇచ్చారు.

పుంగనూరుకు ఏ ముఖం పెట్టుకుని సీఎం వస్తున్నారు?

- ఎస్పీ బదిలీతోనైనా అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలన్న యాదవ్

పుంగనూరు, ఏప్రిల్ 2: పుంగనూరు నియోజకవర్గంలో అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమకేసులతో ప్రజలు, ప్రతిపక్షాలను వేధిస్తున్న మంత్రి పెద్దిరెడ్డికి మద్దతుగా ఓట్లు వేయాలని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని బీసీవైపార్టీ అధినేత రామచంద్ర యాదవ్ మంగళవారం ప్రశ్నించారు. సీఎం వస్తున్నారని రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను నరికివేయడం దారుణమన్నారు. ఎస్పీ జాషువా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తాను లిఖిత పూర్వకంగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో బదిలీ వేటు పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

ఇంకా పింఛను డబ్బులు రాలే..!

- నేడు వచ్చే అవకాశం

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 2: సామాజిక పింఛన్లకు సంబంధించి మంగళవారం సాయంత్రానికి కూడా బ్యాంకులకు నగదు జమ కాలేదు. జిల్లాలో దాదాపు 15 విభాగాలకు సంబంధిచి 2.74 లక్షల మందికి సామాజిక పింఛన్లు అందజేయాలి. ఇందుకోసం ప్రతి నెలా సుమారు రూ.80 కోట్లు అవసరం. మంగళవారానికి కూడా నగదు జిల్లాకు అందలేదు. బుధవారం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఒకవేళ ఉదయం వస్తే బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని పంపిణీ చేయాల్సి ఉంటుంది.

24 మంది వలంటీర్ల రాజీనామా

శాంతిపురం/పెనుమూరు, ఏప్రిల్ 2: శాంతిపురం మండలం చెంగుబల్ల పంచాయతీకి చెందిన 14 మంది.. పెనుమూరు మండలం కలవగుంట సచివాలయంలోని 10 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వారు తమ రాజీనామా లేఖను ఎంపీడీవోలు వెంకటేశ్వరరావు, మైత్రికి అందజేశారు.

భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి : అమర్



మాజీమంత్రి అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీశ్రేణులు

భైరెడ్డిపల్లె, ఏప్రిల్ 2 : జరగబోయే ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. ఇంటిం టికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఇల్లూరు, జాలారిపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిం చారు. అస్తవ్యస్తంగా తయారైన రాష్ట్రాన్ని మళ్లీ చక్కదిద్దడానికి చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అమరనాథ రెడ్డికి టీడీపీ శ్రేణులు సాదరస్వాగతం పలికి ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మండ లాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, జనసేన నాయకులు పసుపులేటి దిలీప్, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో మొదలైన తాగునీటి కష్టాలు



బోరు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

కుప్పం, ఏప్రిల్ 2: కుప్పం పురపాలక సంఘంలో తాగునీటి కష్టాలు మొదల య్యాయి. బోర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్న డీకేపల్లె చెరువు దాదాపు ఎండి పోయే స్థితికి రావడంతో పలు ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. పురపాలక సంఘం పరిధిలోని రాజీవ్ కాలనీలో కొన్ని రోజులుగా ఉన్న బోరు ఎండిపోవడంతో తాగునీటికి ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకుంటే రోజు మార్చి రోజు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నా అవి చాలకపోవడంతో కాలనీ వాసులు అవస్థలు పడు తున్నారు. ఎండిపోయిన బోరు వద్ద మంగళవారం అక్కడి మహిళలు అక్కడ నిరసన తెలిపారు. తమకు కొత్తబోరు వేసి తాగునీటి సమస్య తీర్చాలని కోరారు.

పెన్షన్లు ఆలస్యం కాకుండా పంపిణీ చేయాలి



మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు, ఏప్రిల్2 : పెన్షన్లు ఆలస్యం కాకుండా పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం పలమనేరులో మున్సిపల్ కార్యాల యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు ఆర్‌వీ బాలాజి, నాగరాజు, మురళి, గిరిబాబు, సుబ్బనాగయ్య, మురళి, వీరప్ప, బీఆర్సీ కుమార్, సుధాకర్, పర్వీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ● అదేవిధంగా పలమనేరు ఎంపీడీవో విద్యాసాగర్‌కు టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పెన్షనర్లను ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, సెల్వరాజ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి



మాట్లాడుతున్న విశ్వనాథ్‌నాయుడు

శాంతిపురం, ఏప్రిల్ 2 : తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడే బీసీలు అన్ని విధాలా అభివృద్ధి చెందారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వ నాథ్ నాయుడు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చలపతి అధ్యక్షతన బీసీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలను టీడీపీ ఆదరించినట్లు రాష్ట్రంలో ఏ పార్టీ ఆదరించలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆదరణ పథకం ద్వారా కుల వృత్తులకు అనేక రకాల యంత్రాలను, పనిముట్లను 90 శాతం సబ్సిడీపై అందించిన ఘనత చంద్ర బాబుదే అన్నారు. మళ్లీ బీసీలకు అన్నిరకాలుగా న్యాయం జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలన్నారు. అధికారంలోకి వస్తేనే బీసీలకు రక్షణ చట్టం తెచ్చి పేదలకు అండగా నిలుస్తామన్నారు. మళ్లీ ఆదరణ పథకం, బీసీ కార్పొరేషన్‌తో న్యాయం చేస్తామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై కూటమిని గెలిపించాలని చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజా రిటీ తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, మణి, శరవణ, చలపతి, నారాయణరెడ్డి, శ్యామల, రూప, గోపాల్, నారాయణస్వామి, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా పింఛన్ ఇప్పించండి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2: పింఛన్‌దారులకు ఇబ్బం దులు లేకుండా సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయాలని పుంగ నూరు టీడీపీ మండలా ధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో మునిరెడ్డికి వినతిపత్రం అందజే శారు. సచివాలయ సిబ్బంది ద్వా రా ఇంటింటికీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగా ధర్, ప్రసాద్, కుమార్, సుబ్రహ్మణ్యం, రాంబాబు, హరి, వెంకటేష్, శేఖర్, జన సేన నాయకులు విరూపాక్షి, హరినాయక్, చైతన్యరాయల్ పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మకు చల్లాబాబు పట్టు వస్త్రాల సమర్పణ

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2: పుంగనూరు మండలం సింగిరిగుంటలో వెలసిన తిరుపతి గంగమ్మకు మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. పుంగనూరులో జరిగే సుగు టూరు గంగమ్మ జాతర సందర్భంగా గ్రామంలో జరిగిన గంగమ్మకు మంగళవా యిద్యాల మధ్య పూలు, పట్టువస్త్రాలు సమర్పించారు. టీడీపీ నాయకులు బి.వెంకమునియాదవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జంగాలపల్లెలో తాగునీటి సమస్య

రామకుప్పం, ఏప్రిల్ 2: రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ జంగాలపల్లె గ్రామంలో కొంతకాలంగా తాగునీటి సమస్య నెలకొంది. బోరులో తక్కువగా నీరు వస్తోంది. అవి చాలడంలేదు. అధికారులు స్పందించి బోరు మోటారుకు మరమ్మతు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నేటి నుంచి టీడీపీ ప్రచారం

శాంతిపురం, ఏప్రిల్ 2 : మండలంలోని పలు పంచా యతీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం నుంచి టీడీపీ ఎన్నికల ప్రచారం చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాష్యం విశ్వనాథ్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 64 పెద్దూరు, 4న రాళ్లబూదుగూరు, 5న కోనేరుకుప్పం, 6న చెంగుబల్ల, 7న అనెకర, 12న రేగడదిన్నెపల్లె, 13న కెనమా కులపల్లె, 14 మొరసనపల్లె గ్రామ పంచాయతీల వారీగా ప్రచారాలు నిర్వహి స్తామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రచారాలకు మండల టీడీపీ కుటుంబ సభ్యులు తప్పక హాజరై చంద్రబాబు విజయానికి కృషిచేయాలని కోరారు.

పింఛన్లు ఇంటివద్దే ఇవ్వండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాజ్‌కుమార్

కుప్పం, ఏప్రిల్ 2: లబ్ధిదారులకు పింఛన్లను వాళ్ల ఇంటివద్దకే వెళ్లి అందించాలని టీడీపీ మున్సిపల్ అధ్య క్షుడు రాజ్‌కుమార్ నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంతో నగదు పంపిణీ కార్యక్రమాల నుంచి వలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసిందన్నారు. ఈ నేపథ్యంలో పెన్షన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దకే పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పం కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవుల గోవిందరాజులు



కుప్పం, ఏప్రిల్ 2: కుప్పం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శాంతిపురం మండలం గుంజార్లపల్లెకు చెందిన ఆవుల గోవిందరాజులు అలియాస్ ఆవుల గోపిని పీసీసీ అధి ష్ఠానం మంగళవారం ప్రకటిం చింది. ఆవుల గోపి గతంలో కాంగ్రెస్‌లో ఉంటూ అనంతరం వైసీపీలో చేరారు. కొంత కాలంగా రాజ కీయ కార్యకలాపాలకు దూరంగా ఉంటు న్నారు. ఈ క్రమంలో గతంలో ఆయన కాంగ్రెస్‌కు చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టింది.

టీడీపీలోకి 60 కుటుంబాలు



కుప్పం రూరల్, ఏప్రిల్ 2: కుప్పం మండలం పర్తిచేను, తాయప్ప కొటాలు గ్రామాలకు చెందిన సుమారు 60 కుటుంబాలు సోమవారం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నంలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు కాంగ్రెస్ అభ్యర్థిగా శివశంకర్



షర్మిలకు పూలమొక్కను అందజేస్తున్న శివశంకర్

పలమ నేరు, ఏప్రిల్ 2: గంగవరం మం డలం నల్లగుట్ల పల్లి గ్రామానికి చెందిన బి.శివశ ంకర్‌ను రాను న్న శాశనసభ ఎన్ని కల్లో పలమనేరు నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ ఖరారు చేసింది.

సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయండి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

వి.కోట, ఏప్రిల్ 2: సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ కోరారు. మంగళవారం తమ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధికార ప్రతినిధులు చౌడప్ప, రాంబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, జిల్లా కార్యదర్శి శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

రామకుప్పం, ఏప్రిల్ 2: బందార్లపల్లె పంచాయతీ అ దవిపాముగానిపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో మం గళవారం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి నగదు కాజేశారు. సుమారు రూ.10 వేలు వరకు ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు

సదుం, ఏప్రిల్ 2: పాపిరెడ్డిగారిపల్లెలో నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన మంగళవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉభయదారులుగా దామోదరం దంపతులు వ్యవహరించారు.

పింఛన్లపై వైసీపీ రాజకీయం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 2: పేదలకు అందాల్సిన పింఛన్లపై వైసీపీ రాజకీయం చేయడం దారుణమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పిం ఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశిం చిందన్నారు. చంద్రబాబు కాదని స్పష్టం చేశారు. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టి నెపం చంద్రబాబుపై వేసి ఎన్నికల్లో లబ్ధిపొందాలని కుట్ర చేస్తోందన్నారు. పింఛన్లు ఇళ్ల వద్దకే వెళ్లి ఇవ్వాలని కోరారు. రూ.13 వేల కోట్లను వైసీపీ కాంట్రాక్టర్లకు చెల్లించేయడంతో ఇప్పుడు పింఛన్లకు డబ్బులు లేవన్నారు. చేతగాని పాలనను కప్పి పుచ్చుకునేందుకు, ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు, టీడీపీని దోషిగా నిలపడానికి పెన్షనర్లను సైతం రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హత కలిగిన వలంటీర్లకు వారి అర్హతలను అనుసరించి మెరుగైన ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. కరోనా సమయంలో ఆక్సిజన్ ప్లాంట్ తెచ్చింది ఎన్టీఆర్ ట్రస్ట్ అని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కార్యకర్తలు భోజనాలు అందించారని గుర్తుచేశారు. నియోజకవర్గంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి ప్రతిరోజూ పేదలకు అన్నం పెడుతున్నామన్నారు. అన్న క్యాంటీన్‌ను తొలగించి పేదల కడుపుకొట్టిన వైసీపీని జనం నమ్మరని పేర్కొన్నారు. అన్నకు ఓటేయవద్దని సొంత చెల్లెళ్లే చెబుతున్నారంటే జగన్ పాలన ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ సమా వేశంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడ మురళి, మైనారిటీ సెల్ సెక్రటరీ చాంద్‌బాషా, యాదవ సంఘం యువత అధ్యక్షుడు భార్గవ యాదవ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాగానే రూ.4000 పింఛన్

- వలంటీర్ల సేవలు కొనసాగిస్తాం
- చల్లా రామచంద్రారెడ్డి



తెల్లనీళ్లపల్లెలో కార్యకర్తలతో సమావేశమైన చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, ఏప్రిల్2: టీడీపీ ప్రభు త్వం రాగానే రూ.4000 పింఛన్ ఇస్తా మని పుంగనూరు టీడీపీ ఎమ్మె ల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలియ జేశారు. మంగళవారం గడ్డం వారిపల్లె పంచాయతీలోని తెల్లనీళ్లపల్లె, గడ్డం వారిపల్లె, చౌడగానిపల్లె, యల్లం పల్లె, బత్తలాపురం గ్రామాలలో ఇంటింటా పర్యటించి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తుందని, ఇంకా మెరుగైన జీతాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా మార్చారన్నారు. అప్పులు చేసి సకాలంలో జీతాలు, పింఛన్లు ఇవ్వడం చేతగాక టీడీపీపై నిందలు వేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం అన్నారు. టీడీపీ మండలాధ్యక్షులు గవ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు చంద్రమౌళి, మల్లికార్జున, 20 మంది యువకులు టీడీపీలో చేరారు. నాయకులు ఓబుల్‌రెడ్డి, లక్ష్మీపతిరాజు, బాబునాయుడు, బొయకొండ సుబ్బు, రెడ్డి, జంపాల శ్రీనివాసులు నాయు డు, కుమార్‌రెడ్డి, కల్యాణ్, ప్రభాకర, హరిప్రసాద్, భోజనాల రెడ్డి, వెంకటరమణ, వెంగళపల్లె రమణ, మునెంకటప్ప, చెంగల్రాయుడు, ఆది, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు జాతరకు 270 మందితో బందోబస్తు



మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 2: పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర ప్రశాం తంగా నిర్వహించడానికి 270 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తె లిపారు. జాతర బందోబస్తుకు అడిష నల్ ఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో ఒక డీఎస్పీ, 7మంది సీఐలు, 19మంది ఎస్‌ఐ లు, 71మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబు ళ్లు, 110మంది కానిస్టేబుళ్లు, 19మంది మహిళా పోలీసులు, 29మంది హోంగార్డులు, 14మంది ఎస్‌టీఎఫ్ పోలీసులు బందోబస్తులో ఉంటారని వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ ప్రాంతాలనుంచి బందోబస్తుకు వచ్చిన సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. జాతరకు వచ్చిన భక్తులతో మర్యాదపూర్వ కంగా మాట్లాడాలని సూచించారు. చిన్న గొడవ, ఘర్షణ జరిగినా సంబంధిత అధికారులకు తెలియజే యాలని ఆదేశించారు. గంగమ్మ ఊరేగింపు, జమిందారీ ప్యాలెస్, అమ్మవార్ల ఆలయాలు, బస్టాండ్లు, రద్దీ ఉన్న ప్రాంతాలు, పార్కింగ్ పాయింట్లు వద్ద అప్రమత్తంగా ఉంటూ నిఘా ఉంచాలన్నారు.

బైపాస్‌రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు - చెన్నై జాతీయ రహదారిలోని పుంగనూరు రాంపల్లె వద్ద బైపాస్‌రోడ్డులో పోలీసులు ట్రాఫిక్ మళ్లించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు రాంపల్లె బైపాస్ నుంచి పలమనేరు రోడ్డులోని అరబిక్ కాలేజీ వద్ద కలిసేలా డైవర్షన్ ఏర్పాట్లు చేశారు. మదనపల్లె, పలమనేరు నుంచి వచ్చే వాహనాలను బైపాస్‌రోడ్డు నుంచి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వరకు మాత్రమే అనుమతించారు.

పింఛన్లు ఇంటివద్దే పంపిణీ చేయాలి : టీడీపీ



ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రేమ్‌కుమార్

కుప్పం, ఏప్రిల్ 2: పేదలకు పింఛన్లను ఇళ్ల వద్దకే పంపిణీ చేయాలని తెలుగుదేశం పార్టీ నియో జకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. సహచర నేతలతో కలసి వారు మంగళవారం ఎంపీడీవోకు విపతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ పేదలకు ఇవ్వాల్సిన పింఛన్ల విషయంలో వైసీపీ రాజకీ యాలు చేయడం చాలాదారుణమని విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ మార్పులు జరిగితే, తమమీద నెపం వేయడం దారుణమని, ప్రజలు వాస్తవాలు గ్రహించాలని కోరారు. సచివాలయ సిబ్బంది ద్వారా రెండు రోజుల్లో ఇళ్ల వద్దే పింఛన్లను పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పార్థసారథి, పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్ క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మహేంద్ర, రామచంద్ర, యూనిట్ ఇన్‌ఛార్జిలు రాధాకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, పంచాయతీ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ, గోవిందస్వామి, శ్రీనివాసులు, శివకుమార్, పెద్దబంగారునత్తం ఉప సర్పంచి పావన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని గుర్తుచేయండి: పీఎస్‌ఎం



ఆనిగానూరులో మాట్లాడుతున్న మునిరత్నం

రామకుప్పం, ఏప్రిల్ 2: చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు కృషిచే యాలని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చా ర్జీ మునిరత్నం కోరారు. మంగళవారం ఆనిగా నూరులో నిర్వహించిన ఉన్సిగానిపల్లె పంచా యతీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లా డారు. చంద్రబాబు నేతృత్వంలో కుప్పం నియో జకవర్గంలో చేసిన అభివృద్ధిని పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా 1989 కి ముందు కుప్పం ప్రాంతం ఎలా ఉండేది, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఎలా మారిందని నేటి యువతకు అవగాహన కల్పించాల న్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబా బు కుప్పం ప్రాంతాన్ని వేలకోట్లతో అన్ని రం గాల్లో అభివృద్ధి చేశారన్నారు. వైసీపీ పాలకు లు కుప్పం నియోజకవర్గంపై కక్ష పూరితంగా వ్యవహరించారన్నారు. ఈ సమావేశంలో పా ర్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనం దరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజి నేయరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మున స్వామి, తెలుగురైతు నియోజకవర్గ, మండల అధ్యక్షులు చలపతి, కొళ్లపల్లె బాబు, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రి నారాయణాచారి, తెలుగుయువత అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం పాల్గొన్నారు.

రొంపిచెర్ల మోడల్ స్కూల్లో జూనియర్ కళాశాల ప్రారంభం

రొంపిచెర్ల, ఏప్రిల్ 2: రొంపిచెర్లలోని మోడల్ స్కూల్లో ఈ ఏడాది నుంచి జూనియర్ కళాశాలను కూడా నిర్వహి స్తామని ప్రిన్సిపాల్ సరళ తెలియజేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో ఇప్పటి వరకు పదవ తరగతి వరకు బోధించేవారమని 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు మే నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు ఉన్నాయని వివరిం చారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని తెలియజేశారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

పుంగనూరు కాంగ్రెస్ అభ్యర్థిగా మురళీమోహన్

- ఎస్వీయూ పూర్వ విద్యార్థికి దక్కిన అవకాశం



పుంగనూరు, ఏప్రిల్ 2: పుంగనూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ గోపాలగారి మురళీమోహన్ యాదవ్‌కు అవకాశం దక్కింది. సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట పార్ల మెంటు స్థానం నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవ కాశం కల్పించింది. రామసముద్రం మండలం బల్ల సముద్రం గ్రామానికి చెందిన ఈయన ఎస్వీయూనివర్సిటీ ఎకనమెట్రిక్స్ విభాగం నుంచి 2010లో పీజీ, 2018లో పీహెచ్‌డీ పట్టాలు పొందారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే ఏపీ బీసీ స్టూడెంట్ జేఏసీ కన్వీనర్‌గా, సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. అఖిలేష్ యాదవ్‌తోనూ సాన్నిహిత్యం ఉంది. అనంతరం అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యూత్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా పని చేస్తున్నారు.

ముస్లిం సదర్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి



విలేకరులతో మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

పలమనేరు, ఏప్రిల్2 : పలమనేరు మర్కస్ కాం ప్లెక్సుకు, పట్టణంలోని మసీదుల న్నింటికీ సదర్‌గా ఉన్న ఎస్.కే.ఎస్.జాఫర్ రాజకీయాలకు అతీతంగా మతపరమైన వ్యవహారాలకే పరిమితం కావాలని పలమనేరు టీడీపీ మైనారిటీ నాయకులు సూచించారు. మంగళవారం వారు ఆ మేరకు పలమనేరు టీడీపీ కార్యాలయంలో మాట్లా డారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి ఎన్నికల కమిషన్ నిర్ణయాలను టీడీపీకి ఆపాదిస్తూ జాఫర్ సోషల్ మీడియాలో మాట్లాడడాన్ని ఖండించారు. ఈ కార్య క్రమంలో పలమనేరు మాజీ సదర్ జాఫర్, జిలాని, ఖాజాపీర్, హనీఫ్, అమానుల్లా, మాబాషా, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పెన్షన్లు ఇవ్వకపోతే న్యాయపోరాటం చేస్తాం

● ఎంపీడీవోకు టీడీపీ నేతల వినతి

శాంతిపురం, ఏప్రిల్ 2 : రెండు రోజుల్లోపు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, ఇతర పెన్షనర్లకు పింఛన్లు ఇవ్వకపోతే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పేదవారి తరపున న్యాయపోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్య క్షుడు విశ్వనాథ్‌నాయుడు, మండల జనసేన అధ్యక్షుడు కిషోర్, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు విజయ రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల సచివాలయ ఎదుట కూటమి నేతలు పింఛన్లు పంపిణీలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన తెలియ జేశారు. అనంతరం ఎంపీడీవో డాక్టర్ మైథిలికి వినతి ప్రతం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చంద్ర శేఖర్, మణి, గోపాల్, నారాయణస్వామి, జయరామిరెడ్డి, ఏఎంసీ నాగరాజు, నారాయణరెడ్డి, గోవిందరాజులు, ఉయ్యాల జయరామిరెడ్డి, పెద్దన్న, నాగరాజు, శ్రీరాములు, చంద్ర, చలపతి, కేశవులు, ఈడిగ శివశంకర్, శ్యామల, రూప, హేమావతి పాల్గొన్నారు.

అభివృద్ధే టీడీపీ ధ్యేయం: చల్లాబాబు



ముచ్చుకాల్వలో చల్లాబాబుకు స్వాగతం

సోమల, ఏప్రిల్2: పేదల అభివృద్ధే తమ పార్టీ ధ్యేయమని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సోమల మండ లం ముచ్చుకాల్వలో ఆయన విస్తృతంగా పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడి పోయిందన్నారు. అభివృద్ధి కోసం టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, తవనంపల్లె మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, దిలీప్, పద్మనాభనాయుడు, బంగారప్ప, ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, బాలాజీ, సతీష్, వేణుగోపాల్ నాయుడు, జయచంద్ర పాల్గొన్నారు.

పింఛన్లపై వైసీపీ దుష్ప్రచారం: గౌనివారి



బీసీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి

రామకుప్పం, ఏప్రిల్ 2: ఎన్నికల్లో ల బ్ధిపొందేందుకు పింఛన్లపై వైసీపీ దుష్ప్ర చారం చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీని వాసులు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన రామకుప్పంలో మీడియా సమా వేశంలో మాట్లాడారు. పింఛన్ల పంపిణీ తో బాటూ, ఎన్నికల ప్రక్రియలో వలంటీ ర్లు పాల్గొనకుండా చూడాలని న్యాయస్థా నం నిర్ణయం తీసుకుంటే చంద్రబాబుపై అభాండాలు వేయడం దారుణమన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, గ్రా మ కార్యదర్శుల ద్వారా ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని స్థానిక టీడీపీ నే తలు ఎంపీడీవో ఈశ్వరయ్యకు వినతిపత్ర ం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రి నారాయణచారి, తెలుగుయువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం కోసం టీడీపీ బీసీ డిక్లరేషన్

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువైందని గౌనివారి శ్రీ నివాసులు తెలిపారు. రామకుప్పంలో ఈ నెల 5న, విజలాపు రంలలో 7న నిర్వహించే బీసీ గర్జన సమావేశాలపై రామకు ప్పంలోని పార్టీ కార్యాలయంలో బీసీ నేతలో నిర్వహించిన స న్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికా రంలోకి వచ్చిన వెంటనే 40ఏళ్లకే రూ.4వేల పింఛన్లు, ప్రత్యేక రక్షణ చట్టం, బీసీ సబ్‌ప్లాన్‌కు ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణతో బాటు మరో ఆరు పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ స మావేశాలకు ఆయా క్లస్టర్ల పరిధిలోని అందరు బీసీలు హాజరయ్యేలా బీసీ నేత లు, కార్యకర్తలు కృషిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండ ల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వా హక కార్యదర్శి పత్రనారాయణచారి, తెలుగుయువత అధ్యక్ష, ప్రధానకార్యదర్శు లు విశ్వనాథ్, వెంకటాచలం, బీసీనేతలు గంట్లప్పగౌడు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4 వేల పెన్షన్



చిత్తపారలో డ్రమ్స్ కొడుతున్న సీకే బాబు, గురజాల

గుడిపాల, ఏప్రిల్ 2: టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులైన వారికి నెలకు రూ.4వేలు పెన్షన్‌ను పంపిణీ చేస్తామని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు, ఆయన సతీమణి ప్రతిమ అన్నారు. మంగళవారం మండలంలోని చిత్తపార, బండపల్లె, వెప్పాలమానుచేను, పాపసముద్రం, పేయనపల్లె, మొగరాలపల్లె, చీలాపల్లె పంచాయతీల్లో వారు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలతో పాటు అమ్మఒడి పథకం కింద ఇంటిలో ఎంత మంది ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే సీకేబాబు, మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, నేతలు చెన్నకేశవులు నాయుడు, మురళీ నాయుడు, హేమాద్రి నాయుడు, ఏకాంబరం, గజేంద్ర, చెన్నకేశవులు, చిట్టిబాబు, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఆపద్బాంధవుడు చంద్రబాబు: టీడీపీ



సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 2: ఒక్క ఛాన్స్ పేరుతో సీఎం అయిన జగన్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్రాన్ని దివాలా తీయించేసారని, అలాంటి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి వైపు తీసుకెళ్లే ఆపద్బాంధవుడు చంద్రబాబు మాత్రమేనని జిల్లా టీడీపీ యాదవసాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నెల్లేపల్లె మాజీ సర్పంచ్ పుష్పరాజ్, జిల్లా టీఎన్‌టీయుసీ మాజీ ఉపాధ్యక్షుడు దేవరాజులునాయుడులు అన్నారు. గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీలోని బొబ్బిగానిపల్లె, అప్పిరెడ్డికండిగ, కనికాపురం, ఎస్.కొత్తూరు గ్రామాల్లో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలకు చెందిన కరపత్రాలను నేతలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధిస్తుందని పేర్కొన్నారు. వైసీపీ అరాచకపాలనతో ప్రజలు విసిగివేసారిపోయారని చెప్పారు. ఈకార్యక్రమంలో నేతలు వెంకటేష్‌యాదవ్, జనార్థన్, అఖిల్, శరత్‌బాబు, నరేష్ పాల్గొన్నారు.

ఓటు వేయండి... మహిళా శక్తిని చాటండి



మహిళలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న స్వీప్ సిబ్బంది

చిత్తూరు, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుని మహిళా శక్తిని చాటాలని నగరపాలక సంస్థ స్వీప్ నోడల్ టీమ్ అధికారి చిన్నయ్య పిలుపునిచ్చారు. జిల్లా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మంగళవారం స్వీప్ టీమ్ సభ్యులు మురకంబట్టు, ఎల్‌బీపురం పోలింగ్ కేంద్ర పరిధిలోని మహిళలకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఓటింగ్ విధానం, ఈవీఎంల పనితీరు, వీవీప్యాట్‌ల ఉపయోగం తదితర అంశాలతో కూడిన కరపత్రాలను మహిళలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఉపాధి కూలీలకు ఓటుపై అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ

యాదమరి, ఏప్రిల్ 2: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరి పంచాయతీలోని కోడిగుట్ట దళితవాడలో ఉపాధి కూలీలకు ఓటుపై చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఈ నెల 15వ తేదీలోగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏడీ సుబ్రహ్మణ్యం, ఏపీవో బాల, టీఏలు దేవరాజులు, శ్రీనివాసులురెడ్డి, వెలుగుసీసీలు బాలకృష్ణ, లక్ష్మీపతి, మంజుల, ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్, సంఘమిత్ర రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

విజయపురం, ఏప్రిల్ 2: మండలంలోని గొల్లకండ్రిగ దళితవాడలో మంగళవారం రాత్రి నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో వైసీపీ కార్యకర్తలు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారు మాట్లాడుతూ బలవంతంగా తమకు వైసీపీ కండువా వేశారని, తాము ఎల్లప్పుడు టీడీపీలోనే ఉంటామన్నారు. వైసీపీ నుంచి బాబు, కార్తీక్, పురుషోత్తం, వేలు, శేఖర్, కాటయ్య, ఆనంద్, తిరుపాచ్చి, సురేష్, మాసైయ్య, నారాయణ, మల్లిక, సతీష్ తదితరులు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు గుణభూషణమ్మ, గాలి రమేష్, శివలింగం, మురళీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక దివ్యోపన్యాసం



గొల్లకండ్రిగలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 2: నగరంలోని బజారువీధి గీతాసంఘం కార్యాలయ భవనంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ప్రముఖ పీఠాధిపతి స్వస్వరూపానందగిరిచే జీవితం - భగవద్గీత అనే అంశంపై దివ్యోపన్యాసాలు ఇవ్వనున్నట్లు గీతాసంఘం నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6-30 గంటల నుంచి రాత్రి 8-30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

లారీని ఢీకొని కారు బోల్తా: ఇద్దరికి గాయాలు



చంద్రగిరి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన కారు

చంద్రగిరి, ఏప్రిల్ 2: చంద్రగిరి జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద ముందు వెళుతున్న లారీని కారు ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కాణిపాకానికి చెందిన రామలింగం తన కుటుంబ సభ్యులతో తిరుపతి నుంచి కాణిపాకానికి కారులో వెళుతుండగా ఫ్లైఓవర్ వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముందు చక్రం విరిగిపోవడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి, లాలుశ్రీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి చిత్తూరు డివిజన్‌లో 30 యాక్టు అమలు: డీఎస్పీ

చిత్తూరు, ఏప్రిల్ 2: చిత్తూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు పోలీసు 30 యాక్టు అమలులో ఉంటుందని చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన చేయాలంటే 24 గంటల ముందే అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. అనుమతి తీసుకోకుండా సభలు, సమావేశాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పెన్షన్ నిధులను కాంట్రాక్టర్లకు ఇచ్చిన ఘనుడు జగన్‌రెడ్డి!



కరపత్రాలను పంచుతున్న భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 2: అవ్వ, తాతలకు ఇవ్వాల్సిన పెన్షన్ నిధులను తన సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన ఘనుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విమర్శించారు. తన అనుచరగణమైన కాంట్రాక్టర్లకు బిల్లుల కోసం పెన్షన్ నిధులను ఇచ్చేసి టీడీపీ వల్లనే పెన్షన్‌లు ఇవ్వడంలేదని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడలో రెండవరోజు మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికెళ్లి పంచుతూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు భానుప్రకాష్ వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే రూ.4000 పెన్షన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వలంటీర్లను వైకాపా ప్రభుత్వం రాజకీయపరంగా వాడుకుంటున్నందున ఎన్నికల సంఘం వారిని విధులకు దూరంగా పెట్టిందని చెప్పారు. పెన్షన్లను అవ్వా తాతలకు ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన సంగతి ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో నాయకులు మదివాసన్, పొన్నప్పన్, భూపతి, అయ్యప్ప, గణేష్ వెంకటేష్, నారాయణస్వామి, సాయి, వేలాయుధం, పట్టణ ప్రధానకార్యదర్శి శ్రీనివాసన్, వీకేఎస్‌వాసు గుణశేఖర్, టీఎన్‌టీయూసీ బాలాజీ, కృష్ణారెడ్డి, సురేష్ నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





నగరి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు, చిత్తూరు నగర కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు, జీడీనెల్లూరు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

ఇంటి వద్దే పెన్షన్ అందించాలి: టీడీపీ

నగరి, ఏప్రిల్ 2: ప్రతి లబ్ధిదారుడికి పెన్షన్‌ను ఇంటి వద్దే సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇవ్వాలని నగరి మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్‌కు నగరి టీడీపీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, రుక్కుం బాలాజీ, శ్రీనివాసన్, జ్యోతి నాయుడు, గుణశేఖర్, బాబురెడ్డి, మదివాసన్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు: పెన్షన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి నగరపాలక సిబ్బంది, సచివాలయ సిబ్బంది పెన్షన్ ఇవ్వాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవికుమార్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రెహమాన్, ఆ పార్టీ నేతలు రామభద్ర, పూర్ణచంద్ర, రాసం ఉదయ్, వాసు, పాండియన్ తదితరులు చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ అరుణకు వినతిపత్రాన్ని ఇచ్చారు.

బంగారుపాళ్యం: సామాజిక పెన్షన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయాలని ఎంపీడీవో శివశంకర్‌కు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జనార్థన్ గౌడ్, నేతలు బుస్సా నాగరాజగౌడ్, మోహన్ నాయుడు, రమేష్, దేవయాని వినతిపత్రాన్ని అందించారు.

విజయపురం: ఎంపీడీవో బ్రహ్మయ్యకు మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ధనుంజయ యాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, గుణభూషణమ్మ, స్వామినాథన్, రాజేంద్ర రాజు, మురళీ, అశోక్, రోశి నాయుడు, కపిల్, మణిరెడ్డి తదితరులు వినతిపత్రం అందించారు.

తవణంపల్లె: ఎంపీడీవో కార్యాలయం ఏవోకు టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మోహన్ నాయుడు, సునీల్ కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం ఇచ్చారు.

గుడిపాల: మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ నేతలు పీటర్, గుర్రప్ప నాయుడు, అరుణ్, సుధాకర్ యాదవ్, రాజేష్ తదితరులు ఈవోఆర్డీకి వినతిపత్రాన్ని ఇచ్చారు.

నింద్ర: నింద్రలోని ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి టీడీపీ నాయకులు ప్రకాష్, పరదేశి, శివప్రసాద్, కోటేశ్వరరావు, దేవనసం, ప్రసన్నకుమార్, బీజేపీ నాయకులు భువనేశ్వరి, బాలకృష్ణ, వేణు తదితరులు వినతిపత్రం అందజేశారు.

వెదురుకుప్పం: ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ పురుషోత్తంకు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళీ, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బోడిరెడ్డి హనుమంతరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, టీడీపీ నేత రావిళ్ల వెంకటాద్రి నాయుడు వినతిపత్రం అందచేశారు.

పూతలపట్టు: ఎంపీడీవో ప్రసన్నకుమారికి మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు చంద్రమౌళి, కార్తీకేయ చౌదరి, మునికృష్ణమ నాయుడు, నాధముని, మధు, పలువురు నాయకులు వినతిపత్రం అందించారు.

పెనుమూరు: ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, గుర్రప్ప నాయుడు, ప్రదీప్‌చౌదరి, ఎన్ఎస్ రాజు తదితరులు వినతిపత్రం సమర్పించారు.

శ్రీరంగరాజపురం: ఎంపీడీవో కార్యాలయంలో ఏవో కృష్ణయ్యకి టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు జ్యోతిరెడ్డి, టీడీపీ నాయకులు సిద్దయ్యశెట్టి, పుల్లారుదాము, జనసేన నాయకులు చందు వినతిపత్రం సమర్పించారు.



పూతలపట్టు ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు: ఎంపీడీవో భాస్కర్‌కు జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్, మండల జనసేన అధ్యక్షుడు సురేష్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, నేతలు కామసాని కోదండరెడ్డి, దేవరాజులురెడ్డి, పుష్పరాజ్, జ్యోతిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మోహన్ నాయుడు, ఆంజినేయులుశెట్టి, దేవరాజులు నాయుడు, రుషేంద్రరెడ్డి, దీపక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకులో మెరుగైన సేవలు



గ్రామీణ బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న రజనిబాబు

గుడిపాల, ఏప్రిల్ 2: మండలంలోని గుడిపాల సప్తగిరి గ్రామీణబ్యాంకు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తుందని బ్యాంకు మేనేజర్ రజనిబాబు అన్నారు. మంగళవారం బ్యాంకుసేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యూపీఐ, ఫోన్‌పే, పేటీఎం తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు 43 సంవత్సరాల నుంచి చిత్తూరు, కృష్ణా జిల్లాల్లో 245 శాఖలతో అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఖాతాదారుల డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తామన్నారు. బ్యాంకు సిబ్బంది గిరిబాబు, కావ్య, వంశీ, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళభైరవస్వామికి అష్టమి పూజలు



వడమాల అలంకరణలో కాలభైరవస్వామి

నగరి, ఏప్రిల్ 2: నగరి పట్టణ పరిధిలోని ఈశ్వర ఆలయంలో వెలసివున్న కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం కాళభైరవస్వామి అష్టమిపూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, అభిషేకాలను ఆలయ పూజారి నిర్వహించారు. పాలు, పెరుగు, పంచామృతం, పసుపు, చందనం, పన్నీరు, కొబ్బరినీటితో అభిషేకాలు చేశారు. స్వామివారికి పంచముఖ, కుంభ హారతి ఇచ్చారు. భక్తులందరికీ తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

రేపటి నుంచి పెన్షన్ల పంపిణీ

పాలసముద్రం, ఏప్రిల్ 2: ఈ నెల 4వ తేదీ నుంచి మండలంలోని సచివాలయాల వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షన్లు పంపిణీ చేయడానికి అవసరమైన నగదును బుధవారం బ్యాంకులో విత్‌డ్రా చేసి 4వ తేదీ నుంచి పంపిణీ చేస్తామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు 6వ తేదీన వారి వారి ఇళ్లవద్దనే సచివాలయ సిబ్బంది పెన్షన్లను ఇస్తారన్నారు. పెన్షన్లు తీసుకునేవారు ఆధార్‌కార్డులను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించండి

పాలసముద్రం, ఏప్రిల్ 2: మండలంలోని ప్రజలు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కృష్ణమోహన్ సూచించారు. మంగళవారం ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో పాలసముద్రం పీహెచ్‌సీలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండల్లో తిరగకుండా జాగ్రత్తలు పాటించేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకుండా చూడాలన్నారు. ప్రజలు కాటన్ దుస్తులే ధరించాలని, ఎండకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీ ధరించాలన్నారు. మంచినీటిని ఎక్కువగా తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జ్ఞాన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం ఎల్లసముద్రంలోనే ఇవ్వాలి

విజయపురం, ఏప్రిల్ 2: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ ద్వారా సరఫరా చేసే పోషకాహార కిట్లు, సామగ్రిని ఎల్లసముద్రం గ్రామంలోనే ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఉద్యోగాన్ని వదులుకోవడంతో ఇబ్బందిగా ఉందని, పోషకాహార సామగ్రి కోసం కిలోమీటరు నడవాల్సి వస్తున్నదని, ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీసీల పక్షపాతి టీడీపీ



జయహో బీసీలో మాట్లాడుతున్న ధనుంజయ యాదవ్

విజయపురం, ఏప్రిల్ 2: బీసీల పక్షపాతి టీడీపీ అని రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో మండల టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ క్లస్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. ఒక్కసారి అంటూ అధికారంలో వచ్చిన జగన్ ప్రభుత్వం బీసీ పథకాలను తుంగలో తొక్కి కార్పొరేషన్ పేరిట నిధులను మళ్లించారని విమర్శించారు. గత నాలుగున్నర సంవత్సరాల్లోబీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు తప్ప అభివృద్ధి లేదన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీలంటే అంత అలుసా...?



కాలిన పూరి గుడిసె

గుడి పాల, ఏప్రిల్ 2: మండలంలోని పానాటూరు పంచాయతీ మూలచేను ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిల్లు దగ్ధమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని యానాదులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రఘు, రమ్య, కుటుంబసభ్యులు తహసీల్దార్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గురైన ఇళ్లను పరిశీలించడం తప్ప సాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న పూరి గుడిసెలు కాలిపోవడంతో ఉండటానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అగ్ని ప్రమాదంలో నిత్యావసర సరకులు, నగదు, బంగారం కాలిపోయిందన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఎస్టీ నాయకులు రాము కోరారు.

ఎన్నికల కమిషన్ నిర్ణయం సరైనదే: జనసేన

కార్వేటినగరం, ఏప్రిల్ 2: రాష్ట్రంలో కొందరు ఐఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీపై ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని జనసేన పార్టీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ పేర్కొన్నారు. కార్వేటినగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ పరిటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించే కొంతమంది అధికారులకు ఎన్నికల కమిషన్ తీసుకున్న తాజా నిర్ణయం చెంపపెట్టు లాంటిదని ఆయన అభివర్ణించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడానికి ప్రతి అధికారి కంకణ బద్ధుడై వ్యవహరించాలన్నారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత సాంబశివ నాయుడు తదితరులు

గుడిపాల, ఏప్రిల్ 2: మండల కేంద్రమైన గుడిపాలలో మంగళవారం మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో ముట్టుకూరుపల్లెకు చెందిన సాంబశివ నాయుడు, పవన్‌లు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగరాజ్, సుబ్రహ్మణ్యం, కిట్టు, ఫైజాక్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో మంగళవారం ఎగువ పాలకూరుకు చెందిన చంద్రయ్య నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమలో పంటపల్లె సర్పంచ్ సురేంద్ర నాయుడు, నాయకులు సురేష్, రెడ్డప్ప, యశ్వంత్, హరి, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పూతలపట్టులో అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



తహసీల్దార్‌కు సూచనలిస్తున్న ఆర్వో

వెదురుకుప్పం, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి(ఆర్వో) వెంకటశివ తెలిపారు. మంగళవారం వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయంత్‌కుమార్‌కి పలు సూచనలిచ్చారు. అలాగే ఇనాంకొత్తూరు, పచ్చికాపల్లం, ఆర్కేఎంపురం సహా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలిచ్చారు.

పెనుమూరు: ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దారు సుభద్ర పేర్కొన్నారు. మంగళవారం వారు ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల, సచివాలయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లను ఎక్కడా కూడా ఇన్వాల్వ్ చేయరాదని, అలా చేసిన అధికారులను సర్వీస్ నుంచి తొలగించే అధికారం కలెక్టర్‌కు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు శశిభూషణ్‌రెడ్డి, పవన్‌కుమార్, ఏంఇవో భాస్కర్ నాయుడు, రాజేంద్ర, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: రానున్న ఎన్నికల్లో భాగంగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలని సచివాలయం ఉద్యోగులను అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, ఎంపీడీవో భాస్కర్ ఆదేశించారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులుశెట్టి, ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, విద్యుత్‌శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ ఏఈలు రాజా, గాయత్రి, సుగుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ దుర్గాదేవి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 2: గంగాధరనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చిత్తూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్, సూపర్‌వైజర్లు ధర్మేంద్ర, శైలా, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్‌రాజ్, గోపి, చిరంజీవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి: అమర్



మాజీమంత్రి అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీశ్రేణులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 2: జరగబోయే ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. ఇంటిం టికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఇల్లూరు, జాలారిపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిం చారు. అస్తవ్యస్తంగా తయారైన రాష్ట్రాన్ని మళ్లీ చక్కదిద్దడానికి చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అమరనాథ రెడ్డికి టీడీపీ శ్రేణులు సాదరస్వాగతం పలికి ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, జనసేన నాయకులు పసుపులేటి దిలీప్, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీలో చోరీ

రామకుప్పం, ఏప్రిల్ 2: బందార్లపల్లె పంచాయతీ అడవిపాముగానిపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి నగదు కాజేశారు. సుమారు రూ.10వేలు వరకు ఉండవచ్చని స్థానికులు తెలిపారు.